క్లుప్తంగా

పేద కుటుంబానికి సాయం



అడవిపాలెంలో భవానీకి ఆర్థిక సాయం చేస్తున్న ఎమ్మెల్యే వరప్రసాదరావు

మలికిపురం: మండలంలోని అడవిపాలెంలో పేద కుటుంబానికి చెందిన తాడి భవానీకి గురువారం రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు రూ.10 వేల ఆర్థిక సాయం చేశారు. భవానీకి తగిన జీవనాధారం లేక, ముగ్గురు సంతానంతో ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తెలుసుకున్న గల్ఫ్ గృహ కార్మికుల హెల్పింగ్ హ్యాండ్స్ పైమొత్తాన్ని పంపారు. ఈ మేరకు దీనిని ఆమెకు ఎమ్మెల్యే అందజేశారు. కొల్లాబత్తుల అశోక్, రాపాక చిన్ని, పిండి రాజు, అడబాల శ్రీను, జిల్లెళ్ల జయరాజు, నల్లి ప్రసాదరావు, నల్లి మోహన్, దారం రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాలుడికి చేయూత



అంతర్వేదికరలో బాలుడికి సాయం చెక్కు ఇస్తున్న బుజ్జిరాజు

సఖినేటిపల్లి: అంతర్వేదికరలో కంటి శస్త్రచికిత్స చేయించుకున్న బాలుడు సాగిరెడ్డి భాస్కర్ ఇందీవర్‌కు వసుధ ఫౌండేషన్ రూ.30 వేల ఆర్థిక సాయాన్ని గురువారం అందజేసింది. ఈ మేరకు బాలుడి ఇంటి వద్ద ఆ చెక్కును ఫౌండేషన్ నియోజకవర్గ కో ఆర్డినేటర్ జంపన బుజ్జిరాజు పంపిణీ చేశారు. భాస్కర్ పరిస్థితిని ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట రామరాజుకు బుజ్జిరావు తెలపడంతో తక్షణం స్పందించి సాయమందించారు. మరో ప్రతినిధి బోణం రాజు, స్థానికుడు గిడుగు సుబ్బారావు పాల్గొన్నారు.


ఘనంగా హజరత్ అబ్బాస్ జయంతి



మామిడికుదురులో జరిగిన మిలాద్‌లో ముస్లింలు

మామిడికుదురు: ముస్లింల ఆరాధ్య దైవం హజరత్ అబ్బాస్ జయంతిని గురువారం ఆనందోత్సాహాలతో జరుపుకొన్నారు. నగరం, మామిడికుదురు, మొగలికుదురు గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు. కర్బలాలో హజరత్ ఇమామ్ హుస్సేన్ సేనాధిపతిగా ఇస్లాం చరిత్రలో హజరత్ అబ్బాస్‌కు ప్రత్యేక స్థానం ఉందన్నారు. మామిడికుదురులోని హజరత్ అబ్బాస్ పంజాతో పాటు నగరంలోని మంజిలే కర్బలాలో మీలాద్ జరిగింది. పలువురు ఉర్దూ కవులు తమ కవిత్వాల ద్వారా హజరత్ అబ్బాస్ వీరత్వాన్ని కొనియాడారు.

క్షయ రహిత సమాజమే ధ్యేయం



క్షయ వ్యాధిగ్రస్తుల వివరాలు తెలుసుకుంటున్న జిల్లా అదనపు వైద్యాధికారి భరతలక్ష్మి

అల్లవరం: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వైద్యారోగ్య సిబ్బంది, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి క్షయ రహిత సమాజానికి కృషి చేయాలని జిల్లా అదనపు వైద్యాధికారి సీహెచ్ వి.భరతలక్ష్మి కోరారు. క్షయ వ్యాధి ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా ఆమె మండలంలోని జొన్నాడ, పెనికేరు, చింతలూరు, గుమ్మిలేరు, గ్రామాల్లో గురువారం పర్యటించారు. కుష్ఠు, క్షయ వ్యాధితో బాధపడుతున్న రోగుల వివరాలు తెలుసుకున్నారు. వ్యాధిగ్రస్తులకు అందుతున్న చికిత్స విధానంపై ఆరా తీశారు. వైద్యాధికారులు భవానీశంకర్, డి.సువర్చలాదేవి, కిమ్స్ వైద్యురాలు కె.ప్రసన్న, సీహెచ్‌ఓ పి.రాధాకృష్ణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్ పి.ఉమ, ఆర్.బాలామణి, కో–ఆర్డినేటర్ వై.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచుల హక్కుల కోసం ఉద్యమం

అంబాజీపేట: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి 72, 73 రాజ్యాంగ సవరణ ద్వారా పంచాయతీ చట్టంలో పొందుపరిచిన 29 అంశాల కోసం దేశవ్యాప్త ఉద్యమానికి సిద్ధమవుతున్నట్లు తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్ గౌరవాధ్యక్షుడు నరేంద్ర చెప్పారు. గురువారం ఆయన మాచవరం పంచాయతీలో సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి అధ్యక్షతన విలేకరులతో మాట్లాడారు. సర్పంచులు చిక్కం జంగమయ్య, జల్లి బాలరాజు, అడబాల తాతకాపు, కుంపట్ల నాగలక్ష్మి, అమలాపురం మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు పెద్దిరెడ్డి రాము పాల్గొన్నారు.

సేవకులై.. సంక్షేమ సారథులై

- వలంటీర్ల సేవలకు వందనం
- 4,062 మందికి ఉత్తమ పురస్కారాలు



గోదావరి వరద నీటిలో ఆహార పొట్లాలు తీసుకెళ్తున్న అప్పనపల్లి వలంటీర్ (ఫైల్)

మామిడికుదురు: ఇంట్లో వారిలా.. ఆపదలో ఆపన్నహస్తంలా.. పథకాల అమలులో సారథుల్లా.. సేవలకు ప్రతిరూపంలా వలంటీర్ వ్యవస్థ పేరొందింది. దేశానికే ఆదర్శంగా నిలిచింది.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనల నుంచి ఈ వ్యవస్థ రూపుదిద్దుకుంది.. ప్రభుత్వ పాలనలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది.. పథకాలను ప్రతి ఇంటికీ చేరువ చేసింది. వలంటీర్లు యువ సైనికుల్లా, సేవా సారథుల్లా ముందుకు సాగుతున్నారు. సంక్షేమ పథకాలను అర్హుల చెంతకు చేరవేస్తున్న వీరి సేవలను మెచ్చి ప్రభుత్వం ఏటా వలంటీర్లకు వందనం పేరిట పురస్కారాలు అందిస్తోంది. వరుసగా నాలుగో ఏడాది కూడా సేవావజ్ర, సేవారత్న, సేవామిత్ర అవార్డులు అందించనుంది. ఈ ఏడాది నగదు పురస్కారాల నగదును గణనీయంగా పెంచింది. వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని గుంటూరు జిల్లా ఫిరంగిపురంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గురువారం లాంఛనంగా ప్రారంభించారు. సేవా వజ్రకు రూ.45 వేలు, సేవా రత్నకు రూ.30 వేలు, సేవా మిత్రకు రూ.15 వేల చొప్పున ప్రోత్సాహకాలు అందించనున్నారు. వీటితో పాటు పతకాలు, సర్టిఫికెట్లు, శాలువాలతో సత్కరించనున్నారు.

మూడు నియోజకవర్గాల్లో ఇలా..

పి.గన్నవరం నియోజకవర్గంలో ఏడుగురికి సేవావజ్ర, 20 మందికి సేవారత్న, 1,494 మందికి సేవారత్న అవార్డులు అందించనున్నారు. కొత్తపేట నియోజకవర్గంలో ఐదుగురికి సేవావజ్ర, 20 మందికి సేవారత్న, 1,680 మంది సేవామిత్ర, రాజోలు నియోజకవర్గంలో ముగ్గురికి సేవావజ్ర, 15 మందికి సేవారత్న, 1,199 మందికి సేవామిత్ర పురస్కారాలు అందించనున్నారు. మూడు నియోజకవర్గాల్లో కలిపి 16 మందికి సేవావజ్ర, 55 మందికి సేవారత్న, 3,991 మందికి సేవామిత్ర వెరసి మూడు విభాగాల్లో 4,062 మంది అవార్డులు అందుకోనున్నారు.

చాలా సంతోషంగా ఉంది



సేవావజ్ర పురస్కారం రావడం నాకు చాలా ఆనందంగా ఉంది. వలంటీర్‌గా నాకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తున్నా. నాతో పాటు ప్రతి ఒక్కరూ గ్రామాల్లో ఎంతో కష్టపడి సేవలందిస్తున్నారు. అధికారులు అప్పగించిన బాధ్యతలను సకాలంలో పూర్తి చేస్తున్నాం. ప్రజలకు అందిస్తున్న సేవలకు ప్రతిఫలం లభించడం సంతోషంగా ఉంది.

–కంచి సరస్వతి, సేవావజ్ర, మామిడికుదురు

సామాజిక దృక్పథంతో..



వలంటీర్‌గా సామాజిక దృక్పథంతో పని చేస్తున్నాం. నాకు సేవావజ్ర పురస్కారం రావడంతో నాపై బాధ్యత మరింత పెరిగింది. ప్రభుత్వం ఇస్తున్న గౌరవ వేతనం కోసం కాకుండా ప్రజలకు సేవల చేయాలన్న లక్ష్యంతో వలంటీర్‌గా బాధ్యతలు చేపట్టాను. ప్రతి ఒక్కరూ లక్ష్యాలను పూర్తి చేసి మరింత ఉత్సాహంగా పని చేసేందుకు ఈ అవార్డు దోహదపడుతుంది.

–పితాని లోకేష్, సేవావజ్ర, పెదపట్నం

బాధ్యతగా భావించి సేవలు



గ్రామాల్లో ఎంతో కీలకమైన వలంటీర్ బాధ్యత ద్వారా ప్రభుత్వం మాకు ఎంతో గుర్తింపు నిచ్చింది. ప్రతి ఏడాది మాకు అవార్డులు ఇస్తూ ప్రోత్సహిస్తుంది. వలంటీర్ సేవలను బాధ్యతగా భావిస్తున్నాం. అధికారులు, ప్రజాప్రతినిధులు మమ్మల్ని అన్నివిధాలా ప్రోత్సహిస్తున్నారు. సేవావజ్ర అవార్డు రావడం ఎంతో ఆనందంగా ఉంది.

–మహ్మద్ రఫీ, సేవావజ్ర, మామిడికుదురు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొత్తపేట: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో వివిధ పనుల నిమిత్తం మండలంలోని పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.రవికుమార్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కొత్తపేట, వాడపాలెం, గంటి, పలివెల, అవిడి, ఖండ్రిగ, మందపల్లి, ఏనుగులమహల్ గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకూ సరఫరా ఉండదన్నారు. ఈ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

పి.గన్నవరం: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ ఆనందరాజు తెలిపారు. పి.గన్నవరం, బోడపాటి వారిపాలెం, పోతవరం, ముంగండ, ముంగండపాలెం, కె.ముంజవరం, కతారులంక, కారుపల్లిపాడు, ఉలిశెట్టివారిపాలెం, ఆర్.ఏనుగుపల్లి, కె.ఏనుగుపల్లి, ఎల్.గన్నవరం, మొండెపులంక, పెదకందాలపాలెం, నాగుల్లంక, వాడ్రేవుపల్లి, చాకలిపాలెం, మానేపల్లి గ్రామాలకు సరఫరా ఉండదన్నారు.

సఖినేటిపల్లి: అంతర్వేది, సఖినేటిపల్లి విద్యుత్ సబ్ స్టేషన్లలో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఆ శాఖ డీఈఈ ఎం.రవికుమార్ తెలిపారు. ఈ అంతరాయానికి ఆయా గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు.

ఆర్టీసీలోనే సురక్షిత ప్రయాణం



నేదునూరులో ఆర్టీసీ బస్సును ప్రారంభిస్తున్న మంత్రి పినిపే విశ్వరూప్

అయినవిల్లి: ప్రజలు ఆర్టీసీ ద్వారా అతి తక్కువ ధరకే సురక్షిత ప్రయాణం చేయవచ్చని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. గురువారం నేదునూరులో అమలాపురం నుంచి నేదునూరు మీదుగా రావులపాలెం బస్సు సర్వీసును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో రహదారుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. ఆర్టీసీ బస్సుల ద్వారా ప్రజలు మారుమూల గ్రామాలకు సైతం ప్రయాణం చేయవచ్చన్నారు. పేదలు, విద్యార్థులు, ఉద్యోగులు అతి తక్కువ ధరకే ఆర్టీసీ సేవలను వినియోగించుకుంటున్నారన్నారు. వృద్ధులు, వికలాంగులు, విద్యార్థులకు రాయితీపై బస్సు పాసులు అందిస్తున్నట్లు తెలిపారు. మారుమూల గ్రామాలకూ బస్సులు అందుబాటులోకి రావడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. సర్పంచ్ గుమ్మడి ప్రసాద్, ఎంపీపీ మట్టపర్తి నాగవిజయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు మట్టపర్తి వెంకటరమణ, పెరిచర్ల రఘురామరాజు, జోగి బాబ్జీ, చిలువూరి సాయిరాజు, కామన కృష్ణమూర్తి, కనుమూరి సత్యనారాయణరాజు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జగన్ సర్కారును మళ్లీ ఆశీర్వదించండి

జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు



ఆదుర్రు అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో ముచ్చటిస్తున్న జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు

మామిడికుదురు: ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో మళ్లీ సీఎంగా ఆశీర్వదించాలని జిల్లా పరిషత్ చైర్మన్, పి.గన్నవరం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి విప్పర్తి వేణుగోపాలరావు కోరారు. గురువారం ఆదుర్రు, మాకనపాలెం, పాశర్లపూడిలంక గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన స్థానికులతో మాట్లాడి, వారి సమస్యలను తెలుసుకున్నారు. వచ్చే ఎన్నికలు ఎంతో కీలకమైనవన్నారు. ప్రజలు ఆలోచించి విచక్షణతో ఓట్లు వేయాలని, మంచి చేసిన సీఎం జగన్‌కు అండగా నిలవాలని కోరారు. మోరిపాలెంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడ విద్యార్థులకు ప్రభుత్వం ద్వారా అందుతున్న సేవలపై ఆరా తీశారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. ప్రజలకు సేవ చేస్తున్న వలంటీర్లపై ప్రతిపక్షాలు విషం చిమ్ముతున్నాయని, వాస్తవాలను ప్రజలు ఇప్పటికైనా గ్రహించాలన్నారు. పార్టీ నేతలు కొమ్ముల రాము, జక్కంపూడి తాతాజీ, నెల్లి దుర్గాప్రసాద్, కుసుమ మహాలక్ష్మమ్మ, కుసుమ శ్రీను, జక్కంపూడి వాసు, తులా గోపాలకృష్ణ, కాండ్రేగుల శ్రీనివాస్, చెల్లింగి రామకృష్ణ, ముత్యాల నర్సింహారావు, పోలమూరి గోపాలకృష్ణ, చిక్కం బుజ్జిబాబు, పితాని సురేంద్ర, అంకాని అంజి పాల్గొన్నారు.

మహిళా సాధికారతే పరమావధి



సభకు హాజరైన పొదుపు సంఘాల మహిళలు



మహిళలకు వైఎస్సార్ ఆసరా నమూనా చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాదరావు

- ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు
- రూ. 38.29 కోట్ల ఆసరా మంజూరు

రాజోలు: మహిళా సాధికారతే పరమావధిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. గురువారం రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా రాజోలు మండలంలో 11,477 మంది మహిళలకు రూ.38.29 కోట్ల లబ్ధి పంపిణీ కార్యక్రమం జరిగింది. తొలుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం జ్యోతిప్రజ్వలన చేసి సమావేశాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆసరా పథకం ద్వారా మంజూరైన లబ్ధి నమూనా చెక్కును ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాపాక మాట్లాడుతూ మహిళలు ఆర్థిక పురోభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తుందన్నారు. ఆర్థిక స్వావలంబన సాధించేందుకు చేపట్టిన సంక్షేమ పథకాలు నిరుపేద కుటుంబాల్లో మార్పులు తీసుకు వచ్చాయన్నారు. మహిళలను ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేసేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. పథకాల అమలులో ఎలాంటి వివక్ష లేకుండా అర్హతే ప్రామాణికంగా ఎంపికలు చేస్తున్నారన్నారు. ఎంతో పారదర్శకంగా పథకాల లబ్ధి నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించాలని పిలుపునిచ్చారు. ఏఎంసీ చైర్మన్ గుబ్బల రోజారమణి, జెడ్పీటీసీ సభ్యురాలు మట్టా శైలజ, నెడ్‌క్యాప్ డైరెక్టర్ పాటి శివకుమార్, సర్పంచ్ రేవు జ్యోతి, సొసైటీ అధ్యక్షుడు కూనపరెడ్డి రాంబాబు, మండల పార్టీ అధ్యక్షుడు కట్టా శ్రీనివాసరావు, నాయకులు దార్ల పెదబాబు, కంచర్ల శేఖర్, మట్టా ఏడుకొండలు, తెన్నేటి కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ఎగ్జిబిషన్లతో సృజనాత్మకత



సైన్స్ ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ వరలక్ష్మి

అంబాజీపేట: విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికితీసేందుకు సైన్స్ ఎగ్జిబిషన్లు దోహదపడతాయని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు బూడిద వరలక్ష్మి అన్నారు. ఇరుసుమండ సెయింట్ జోసెఫ్ ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాలలో ప్రిన్సిపల్ సిస్టర్ హన్సి అబ్రహం, కరస్పాండెంట్ రేజీ ఆధ్వర్యంలో సైన్స్ ఎగ్జిబిషన్ గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ, జెడ్పీటీసీ మాట్లాడుతూ ప్రజలకు, సమాజానికి ఉపయోగపడే ప్రాజెక్టులను విద్యార్థులు తయారుచేయడం అభినందనీయమన్నారు. ఈ ఎగ్జిబిషన్‌లో సైన్స్ ఉపాధ్యాయులు పి.అరుణ్‌ప్రకాష్, ఎ.రాజశేఖర్, ఎ.భీమశంకరం రవీంద్ర పర్యవేక్షణలో 300 మంది విద్యార్థులు పాల్గొని 150 పైగా ప్రాజెక్టులను ప్రదర్శించారు. సర్పంచ్ అనిశెట్టి నాగలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు నాగబత్తుల సత్యానందం, మామిడిశెట్టి బలరామకృష్ణ, ఆర్‌సీఎం చర్చి ఫాదర్స్ వినయ్, ఏసు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల పరిశీలన



ఆత్రేయపురంలో ఇళ్ల స్థలాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ వెంకటరామయ్య

ఆత్రేయపురం: స్థానికంగా ఇళ్ల స్థలాలను గురువారం తహసీల్దార్ ఎం.వెంకటరామయ్య పరిశీలించారు. స్థలాలను పేదలకు అందించేందుకు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. సుమారు 550 మందికి స్థలాలను ఇచ్చేందుకు ప్రభుత్వం స్థల సేకరణ చేసింది. దీంతో స్థలాలను రిజిస్ట్రేషన్ చేసి లబ్ధిదారులకు స్థలం చూపించాలని సిబ్బందిని ఆయన ఆదేశించారు. ఈ పనులు రెండు రోజుల్లో పూర్తి చేయాలన్నారు. దీంతో సిబ్బంది పనులు వేగవంతం చేశారు. అనంతరం మండలంలోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ పరిశీలించారు. ఆర్ఐ భవానీ, వీఆర్వో జ్యోతి, సర్వేయర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలోచింపజేసిన మాక్‌డ్రిల్



అత్యవసరంగా సమావేశమైన అగ్నిమాపక, పోలీస్ సిబ్బంది

యానాం: పుదుచ్చేరి డిపార్ట్‌మెంట్ ఆఫ్ రెవెన్యూ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్, స్టేట్ ఎమర్జన్సీ ఆపరేషన్ సెంటర్, మినిస్ట్రీ ఆఫ్ హోం ఎఫైర్స్ ఆధ్వర్యంలో గురువారం యానాంలో నిర్వహించిన మాక్ డ్రిల్ అందరినీ ఆలోచింపజేసింది. తుపానులు, వరదలు వంటి ప్రకృతి వైపరీత్యాల సమయంలో తీసుకోవాల్సిన అత్యవసర విధులు, వివిధ శాఖల బాధ్యతలను తెలియజేస్తూ మాక్ డ్రిల్ సాగింది. ముందుగా స్టేట్ ఎమర్జన్సీ సెంటర్ పుదుచ్చేరి నుంచి బంగాళాఖాతంలో సైక్లోన్ ఏర్పడిందని దాని పేరు ఓలీగా నామకరణం చేసినట్లు అత్యవసర సందేశం యానాం ఆర్ఏఓ కార్యాలయానికి వచ్చింది. ఈ నేపథ్యంలో పరిస్థితిని ఎదుర్కొనేందుకు స్థానిక మార్కెట్ వద్ద బేస్ క్యాంప్‌ను ఏర్పాటుచేసి ఎన్‌డీఆర్ఎఫ్, రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక దళం, విద్యుత్, వైద్యం, పీడబ్ల్యూడీ తదితరశాఖల అధికారులు సమావేశమయ్యారు. అనంతరం చేపట్టాల్సిన చర్యల గురించి చర్చించి తీర గ్రామాలను అప్రమత్తం చేశారు. అనంతరం తుపానుకు పడిపోయిన చెట్లను తొలగించడం, స్థానిక బోట్ హౌస్ వద్ద నుంచి గోదావరిలోకి వెళ్లిన బాధితులను తుపాను రిలీఫ్ కేంద్రాలకు తరలించడం, పడిపోయిన విద్యుత్ స్తంభాలను సరిచేయడం మాక్ డ్రిల్‌లో నిర్వహించారు. ఆర్ఏఓ మునిస్వామి, ఎస్పీ రాజశేఖరన్ పాల్గొన్నారు.

ఏపీ జేఏసీ నిరసన

కొత్తపేట: రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులకు ఐదేళ్లుగా చెల్లించాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీ జేఏసీ కొత్తపేట తాలూకా నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద తాలూకా జేఏసీ అధ్యక్షుడు మోటూరి రామారావు ఆధ్వర్యంలో జేఏసీ నాయకులు, ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. జేఏసీ ప్రధాన కార్యదర్శి ఎస్‌వీ రామారావు, తాలూకా పెన్షనర్ల సంఘ అధ్యక్షుడు ఏడిద సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

కొత్తపేట: ఆర్థిక ఇబ్బందుల కారణంగా పురుగు మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. కొత్తపేట ఎస్సై ఎం.అశోక్ కథనం ప్రకారం, ఖండ్రిగ శివారు అల్లపల్లివారిపాలెం గ్రామానికి చెందిన అల్లవల్లి వీరన్న (53) కూలిపని చేసుకుంటూ జీవనోపాధి సాగిస్తున్నాడు. మద్యానికి బానిసైన వీరన్న ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. గురువారం తన ఇంటి ముందు కొబ్బరి తోటలోకి వెళ్లి పురుగు మందు తాగి వచ్చి మంచంపై పడుకుని వాంతులు చేసుకుంటుండగా కుటుంబ సభ్యులు, స్థానికులు గమనించి కొత్తపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని కుమారుడు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

నేడు, రేపు సాగునీరు విడుదల

కొత్తపేట: మండలంలోని వాడపాలెం చానల్ ద్వారా శుక్ర, శనివారాల్లో సాగునీరు విడుదల చేయనున్నట్టు ఇరిగేషన్ కొత్తపేట సెక్షన్ ఆఫీసర్ నవీన్‌కుమార్ వి.నవీన్‌కుమార్ తెలిపారు. ప్రస్తుత రబీ వరి పంటకు వంతుల వారీగా సాగునీటి సరఫరాలో భాగంగా వాడపాలెం లాక్ పైన వాడపాలెం ఓల్డ్, న్యూ చానల్స్ ద్వారా కొత్తపేట, వాడపాలెం, బిళ్లకుర్రు గ్రామాల పరిధిలో వరి పంటలకు శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి శనివారం మధ్యాహ్నం 3 గంటల వరకూ నీరు సరఫరా చేస్తామన్నారు. ఆయా రైతులు పంట బోదెలను బాగు చేసుకుని సాగునీరు శివారు భూముల వరకూ వినియోగించుకోవాలని సూచించారు.

25న జిప్‌మెర్ ఆసుపత్రి ప్రారంభం

- వర్చువల్ విధానంలో ప్రారంభించనున్న ప్రధాని మోదీ



ఆసుపత్రిలో ఏర్పాట్లపై చర్చిస్తున్న ఆర్ఏఓ మునిస్వామి

యానాం: కేంద్ర ప్రభుత్వ నిధులు రూ.48.85 కోట్ల ఖర్చుతో నిర్మించిన జవహర్‌లాల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పోస్టు గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(జిప్‌మెర్) మల్టీ స్పెషాలిటీ కన్సల్టింగ్ 100 పడకల ఆసుపత్రిని ఈ నెల 25న వర్చువల్ పద్ధతిలో దేశ ప్రధాని నరేంద్రమోదీ చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. జిప్‌మెర్ ఆసుపత్రిలో సేవలు అందించేందుకు రిక్రూట్‌మెంట్ ద్వారా నియమించిన పర్మినెంట్ వైద్యులు గురువారం ఆసుపత్రికి చేరుకున్నారు. గురువారం జిప్‌మెర్ ఆసుపత్రి ఆవరణలో ఆర్ఏఓ మునిస్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రారంభ కార్యక్రమాల ఏర్పాట్ల గురించి చర్చించారు. సోమవారం జిప్‌మెర్ డైరెక్టర్ రాకేష్ అగర్వాల్ రానున్నారని తెలిపారు. సమావేశంలో ఎస్పీ రాజశేఖరన్, జిప్‌మెర్ అధికారులు పాల్గొన్నారు.

రమణీయం.. స్నోయగం



అంబాజీపేటలో ఉదయం తొమ్మిది గంటలకూ కురుస్తున్న మంచు

అంబాజీపేట: తెల్లవారినా మంచు కురుస్తూనే ఉంటోంది.. రాత్రంతా దుప్పటిలా కప్పేస్తున్న హిమం, ఉదయం పది గంటలైనా వీడడం లేదు. చలి పులి రానురానూ పెరిగిపోతోంది. రహదారులపై రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగిస్తోంది. అంబాజీపేటలో గురువారం ఉదయం 9 గంటల వరకూ మంచు దుప్పటి వీడలేదు. మధ్యాహ్నం సూర్యుడు తన ప్రతాపాన్ని చూపాడు.